ప్రభాత గమనం

PRABHATA GAMANAM

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది.
ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 315 గురువారం 3-9-2026

కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు.!

నాపై కాదు.. ముందు రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి:

- ఢిల్లీలో పార్టీ అధిష్ఠానాన్ని కలిసిన కొండా సురేఖ...
- పార్టీలో బీసీ నేతలను టార్గెట్ చేస్తున్నారని విమర్శ...
- అధిష్ఠానం తనను రాజీనామా చేయాలని కోరలేదని వెల్లడి...



ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ... సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె... తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పార్టీ పెద్దలను డిమాండ్ చేశారు.తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేస్తూ చర్యలు తీసుకోవాలనుకోవడం సరికాదని సురేఖ స్పష్టం చేశారు. మహిళలు స్వతంత్రంగా జీవించాలని రాహుల్ గాంధీ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. తన కుమార్తెను తీవ్రంగా రెచ్చగొట్టడం వల్లే ఆమె ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. పార్టీలో బీసీలకు ఒక న్యాయం... రెడ్డి సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు ఎంతోమంది అనుచిత వ్యాఖ్యలు చేసినా చర్యలు తీసుకోలేదని, కేవలం బీసీలనే టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు.పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి సొంతంగా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం? అని సురేఖ ప్రశ్నించారు. రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయని.. రేవంత్ పాలనపై మంత్రులు, సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరలేదని, జరిగిన పరిణామాలన్నింటినీ రాతపూర్వకంగా హైకమాండ్‌కు నివేదించినట్లు తెలిపారు.

‘ఎటు చూసినా విధ్వంసం, వికృతమే”

- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్....
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల...
- కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ...
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ...
- రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్...
- కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని -ఆరోపణ..



హైదరాబాద్ సెప్టెంబర్ 2(ప్రభాత గమనం):

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. ‘పీడన’ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు.రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

రామమందిరం ట్రస్ట్ లో కీలక మార్పులు..



న్యూఢిల్లీ సెప్టెంబర్ 2(ప్రభాత గమనం):

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బుధవారం నిర్వహించిన సమావేశంలో ట్రస్టుకు ముగ్గురు కొత్త సభ్యులను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా, ఆలయ నిర్వహణ కోసం తొలిసారిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) నియామకాన్ని కూడా త్వరలోనే పూర్తి చేయనున్నారు.నూతనంగా నియమితులైన సభ్యుల్లో ఢిల్లీకి చెందిన మహేశ్ భగచంద్కా, అయోధ్యకు చెందిన మదన్ మోహన్ పాండే, షికోహాబాద్ వాసి నిర్మలా యాదవ్ ఉన్నారు. వీరిలో మహేశ్ భగచంద్కా, దివంగత విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అగ్రనేత అశోక్ సింఘాల్‌కు సమీప బంధువు కావడం గమనార్హం.ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేయడం, మరో సభ్యుడు విమలేంద్ర మోహన్ మిశ్రా కన్నుమూయడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది ఆరంభంలో ఆలయ విరాళాల నిర్వహణలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు ట్రస్టు పునర్వ్యవస్థీకరణకు పూనుకుంది. ఇందులో భాగంగానే ఈ తాజా నియామకాలు జరిగాయి.ఆలయ దైనందిన కార్యకలాపాలు, ఆర్థిక వ్యవహారాలను మరింత వృత్తిపరంగా నిర్వహించేందుకు తొలిసారిగా సీఈఓ పదవిని అందుబాటులోకి తెచ్చారు. ఈ పోస్టుకు సుమారు 5,500కు పైగా దరఖాస్తులు రాగా, త్రిసభ్య ఎంపిక కమిటీ ముగ్గురి పేర్లను ట్రస్టుకు సిఫార్సు చేసింది. వీరిలో ఒకరిని సీఈఓగా ఎంపిక చేసే ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉంది. బహుశా సెప్టెంబరు 3వ తేదీన సీఈఓ పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

వరదల వేళ భారత్ అండ....

- నేపాల్ పార్లమెంట్‌లో ప్రధాని బాలేన్ షా ప్రశంసలు....
- భారత్, చైనా సాయానికి బాలేన్ షా కృతజ్ఞతలు...
- తొలిరోజు నుంచే పరిస్థితిని అంచనా వేశారని వెల్లడి...
- మారుమూల ప్రాంతాలకు భారత నిపుణులు చేరుకున్నారని వ్యాఖ్య...
- నేపాల్ వరదల్లో 1,127కి చేరిన మృతుల సంఖ్య...
- 4,858 మంది ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది...



నర్సరీల పై సమగ్ర విచారణ జరిపించాలి.

- కేసముద్రం మండలంలో నర్సరీలపై వివరాలను వెల్లడించాలి...
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోడిశాల వెంకన్న....



కేసముద్రం సెప్టెంబర్ 2(ప్రభాత గమనం):

కేసముద్రం మండలంలో 2025--26 సంవత్సరానికి సంబంధించి నర్సరీల నిర్వహణ, మొక్కల నాటకం, వాచ్‌మెన్‌ల నియామకం, వారికి చెల్లిస్తున్న జీతభత్యాలపై సమగ్ర వివరాలను వెల్లడించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోడిశాల వెంకన్న డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్ లో మహబూబాబాద్ జిల్లా పీడీకి మధుసూధన రాజ్ కు వినతిపత్రం సమర్పించారు.అనంతరం వెంకన్న మాట్లాడుతూ..మండలంలో ఎన్ని నర్సరీ కేంద్రాలు ఉన్నాయి, ఎన్ని మొక్కలు నాటారు, ఎంత మంది వాచ్‌మెన్‌లు విధులు నిర్వహిస్తున్నారు, వారికి ఎంత మేరకు జీతాలు చెల్లిస్తున్నారనే వివరాలను గతంలో ఆర్టీఐ ద్వారా కోరినప్పటికీ ఇప్పటి వరకు సరైన వివరణ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈవిషయంపై కేసముద్రం మండల ఏపీఓ అధికారికి ఫిర్యాదు చేసి మూడు నెలలు దాటినా ఇప్పటి వరకు సమాచారం ఇవ్వలేదని ఆయన ధ్వజమెత్తారు. వ్యవసాయ కార్మిక సంఘం తరఫున నర్సరీలకు సంబంధించిన వివరాలను కోరినా అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని వెంకన్న ఆరోపించారు. గతంలో ఏపీఓ ఎర్ర యాకాంబరంకు ఫిర్యాదు చేసినప్పటికీ దీనిపై ఎలాంటి వివరణ ఇవ్వలేదని తెలిపారు.కేసముద్రం మండలంలోని నర్సరీలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించడంతో పాటు, నర్సరీల నిర్వహణలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఏపీఓఎర్ర యాకాంబరంపై తగిన చర్యలు తీసుకుని, వెంటనే విధుల నుంచి తొలగించాలని జిల్లా అధికారులను కోరారు.సానుకులంగా స్పందించిన పీడి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు తెలిపారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి.

- ఎస్సీ,ఎస్టీ,బిసీ జాక్ డిమాండ్...
- తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత...



కేసముద్రం సెప్టెంబర్ 2(ప్రభాత గమనం):

రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ. 14,000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్సీ ఎస్టీ బీసీ జాక్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ జాక్ పిలుపు మేరకు బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల తహసిల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కేసముద్రం మండల కన్వీనర్ కొమ్ము రామకృష్ణ మాట్లాడుతూ..ఫీజుల చెల్లింపుల్లో తీవ్ర ఆలస్యం కావడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువును కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు విడుదల కాకపోవడం వల్ల అనేకమంది విద్యార్థుల విద్య మధ్యలోనే ఆగిపోతోందని, కొందరు మనస్తాపంతో ఆత్మహత్యలకు పూనుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య వల్ల దాదాపు కోటి కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయన తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న రూ. 14,000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ నిధులను తక్షణమే ఖాతాల్లో జమ చేయాలని తెలిపారు.కాలేజీ యాజమాన్యాలు చెల్లించాల్సిన ఫీజులతో నిమిత్తం లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లను వెంటనే అందజేసేలా ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బిసీ జాక్ కో-కన్వీనర్ వల్లందాసు సతీష్, మండల కమిటీ సభ్యులు కొమ్ము సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు.

- పాఠశాల విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ....

కేసముద్రం సెప్టెంబర్ 2(ప్రభాత గమనం):

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఆమీనాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామ సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం పాఠశాల విద్యార్థుల మధ్య ఘనంగా జరిగాయి. విద్యార్థులపై ఉన్న ప్రేమాభిమానాలతో సుధాకర్ రెడ్డి అమీనపురం ప్రాథమిక పాఠశాల పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా సామ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. "చిన్నారుల ముఖాల్లో కనిపించే చిరునవ్వులే నా జన్మదినానికి నిజమైన, అత్యంత ప్రత్యేకమైన కానుక" అని సంతోషం వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు జన్ను కట్టయ్య, సీనియర్ నాయకులు సిరామ్ శెట్టి సురేందర్, కొడాలి నాగేంద్రబాబు, జవాజి రాజు, కొడాలి సాయికిరణ్, కడారి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



కిసాన్ పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయాలి.

- ఎంసీపీఐయూ డిమాండ్...
- కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో నిరసన...



కేసముద్రం సెప్టెంబర్ 2(ప్రభాత గమనం):

భూమి పట్టా కలిగిన అర్హులైన రైతులందరికీ పీఎం కిసాన్ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఎంసిపిఐయూ పార్టీ, ఏఐసిటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.?ఈ సందర్భంగా ఎంసిపిఐయు మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 01-02-2019 వరకు మాత్రమే పట్టా పొందిన రైతులకు పీఎం కిసాన్ నిధులను జమ చేస్తోందని విమర్శించారు. 02-02-2019 నుండి 2026 వరకు కొత్తగా భూమి పట్టాలు పొందిన అర్హులైన ప్రతి రైతుకూ ఈ పథకాన్ని వెంటనే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. రైతుల హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా కమిటీ సభ్యులు బొల్లోజు రామ్మోహన చారి,ఏఐసిటియు కార్మిక సంఘం నాయకులు ఎండి హబీబ్, మాచర్ల వెంకన్న, ఎర్ర సంధ్య, పయ్యావుల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాత భాగం

హైదరాబాద్ సెప్టెంబర్ 2(ప్రభాత గమనం):

నేపాల్‌లో భారీ వరదలు, కొండచరియల విరిగిపడటంతో తీవ్ర నష్టం జరిగిన వేళ భారత్ అందించిన సకాల సాయంపై ఆ దేశ ప్రధాని బాలేన్ షా ప్రశంసలు కురిపించారు. భారత్, చైనా సకాలంలో సహాయక చర్యలకు మద్దతు ఇచ్చాయని నేపాల్ పార్లమెంట్‌లో తెలిపారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అంతర్జాతీయ సాయం తిరస్కరించే ప్రశ్నే తలెత్తదని స్పష్టం చేశారు.వరదల ప్రభావాన్ని అంచనా వేసేందుకు భారత్, చైనా తమ సాంకేతిక నిపుణులను పంపాయని బాలేన్ షా చెప్పారు. విపత్తు సంభవించిన తొలిరోజు నుంచే నష్టాన్ని అంచనా వేసేందుకు వైమానిక పరిశీలనతో పాటు ఇతర మార్గాల్లో పరిస్థితిని పరిశీలించారని తెలిపారు. పరిస్థితులు అనుకూలించిన వెంటనే భారత సాంకేతిక నిపుణులు మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకున్నారని పేర్కొన్నారు.వరదల ప్రాంతాల్లో బురద, మట్టి భారీగా పేరుకుపోవడంతో సహాయక చర్యలు అత్యంత కష్టంగా మారాయని బాలేన్ షా వివరించారు. ఎక్స్కవేటర్లు మాత్రమే కాదు.. సైన్యం, సాయుధ పోలీసు సిబ్బంది కూడా నిలబడేందుకు స్థలం లేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.నేపాల్‌లోని భోటేకోషి నది ఉప్పొంగడంతో రసువా ప్రాంతాన్ని భారీ వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ విపత్తుకు వాతావరణ మార్పులే కారణమని బాలేన్ షా ఇటీవల పేర్కొన్నారు. ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రపంచ స్థాయిలో సమన్వయంతో కూడిన విపత్తు నిర్వహణ వ్యవస్థ అవసరమని పిలుపునిచ్చారు.నేపాల్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య బుధవారం నాటికి 1,127కి చేరింది. వేలాది మంది గల్లంతైన నేపథ్యంలో సహాయక బృందాలు వారి కోసం గాలింపు కొనసాగిస్తున్నాయి. ఇప్పటివరకు నేపాల్ భద్రతా బలగాలు 6,541 మందిని ప్రభావిత ప్రాంతాల నుంచి రక్షించాయి. మరో 4,858 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది.భారత్ భారీ స్థాయిలో మానవతా, సాంకేతిక సహాయక చర్యలు చేపట్టింది. ప్రత్యేక టన్నెల్ రెస్క్యూ బృందాలు, వైద్య బృందాలు, డీఎన్ఏ ఆధారంగా మృతులను గుర్తించే ఫోరెన్సిక్ నిపుణులను నేపాల్‌కు పంపింది. బాధితులను రక్షించేందుకు భారత్ నుంచి ఇప్పటివరకు కనీసం 163 మందిని తరలించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది.అత్యవసర సహాయక సామగ్రిలో భాగంగా భారత్ నాలుగు విడతల్లో తాత్కాలిక షెల్టర్లు, దుప్పట్లు, హైజీన్ కిట్లు, సోలార్ లైట్లు, మందులు పంపింది. 70 టన్నులకు పైగా దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, టార్పాలిన్లు, ప్లాస్టిక్ షీట్లు, హైజీన్ కిట్లను విమానాల ద్వారా నేపాల్‌కు తరలించింది. బాధితుల సహాయక చర్యల కోసం భారత విదేశాంగ శాఖతో పాటు ఖాట్మండు, బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు.

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

కాంగ్రెస్ అంటేనే దగా.... మోసం...

- వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం...
- ఆరు గ్యారంటీలు.. 420 హామీలతో ప్రజలను వంచించారు..
- రైతులు, విద్యార్థులు, కార్మికుల సమస్యలు పట్టించుకోలేదు...
- కేసీఆర్ రావడం పక్కా.. రామరాజ్యం కావడం ఖాయం....
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారు...
- మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్...
- మానుకోట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ భారీ నిరసన...



మహబూబాబాద్ సెప్టెంబర్ 2(ప్రభాత గమనం):
కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా, మోసం అని మాజీ ఎమ్మెల్యే భానోత్ శంకర్ నాయక్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ మానుకోట జిల్లాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అరకొరగా అమలు చేస్తోందని శంకర్ నాయక్ ఆరోపించారు. రైతు రుణమాఫీని కూడా సక్రమంగా అమలు చేయకపోవడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయాన్ని పండుగ చేయాలనే లక్ష్యంతో అనేక సంస్కరణలు చేపట్టి, రైతుల సంక్షేమానికి పలు పథకాలను అమలు చేశామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని కేసీఆర్ ముందుగానే హెచ్చరించారని గుర్తుచేశారు.విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారని శంకర్ నాయక్ అన్నారు. గురుకుల విద్యార్థులు సైతం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు భూ కబ్జాలు, భూ దోపిడీలకు పాల్పడుతున్నారని శంకర్ నాయక్ ఆరోపించారు. గతంలో మానుకోట జిల్లాలో ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులను, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ చేయలేకపోతుందని విమర్శించారు. ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రాజెక్టులు నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణ, మిగిలిన పనుల పూర్తి విషయంలో శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు.కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని శంకర్ నాయక్ అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కేసీఆర్ తిరిగి రావడం పక్కా.. రామరాజ్యం కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. మానుకోట జర్నలిస్టులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించిందని కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారికి కేటాయించలేకపోయారని విమర్శించారు. జర్నలిస్టుల సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేస్తామని అన్నారు.

ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచారు

-అభివృద్ధి, సంక్షేమానికి ఆయన సేవలు ఆదర్శం
-గార్లలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం

గార్ల, సెప్టెంబర్ 2 (ప్రభాత గమనం):
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని గార్ల బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా గార్ల సింగిల్ విండో చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గార్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ గౌడ్, గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భాను పార్వతీహతి రామ్ నాయక్, ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలుగు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని అన్నారు.పేదలు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని వారి సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకున్న నాయకుడిగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆయన చూపిన దారిని నేటి తరానికి ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మర్రిగూడెం సర్పంచ్ భూక్య రామ్‌సింగ్, గార్ల మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మహమ్మద్ జరీనా బేగం రహీం ఖాన్, కాంగ్రెస్ నాయకులు షేక్ యాకూబ్ పాషా, బాబూలాల్, కోలా కుమార్ గౌడ్, దీకొండ రాము, నెహ్రూ, షేక్ ఉస్మాన్, మండా రవి గౌడ్, షేక్ మౌలానా, గుండ్లపల్లి నాగయ్య, సైజాద్, ముత్యం పూర్ణ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

తాగునీటి కోసం పోరుబాట

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన
- గార్ల పంచాయతీ గ్రామసభ ముట్టడి
-ఫిల్టర్ బెడ్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి:
- సీపీఎం డిమాండ్
- ప్రత్యామ్నాయ సరఫరాపై సర్పంచ్ హామీతో సలమసలిన ఆందోళన

గార్ల,సెప్టెంబర్ 2 (ప్రభాత గమనం):స్థానిక ఫిల్టర్ బెడ్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి గార్ల పట్టణ ప్రజల దాహార్తిని తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ నీరు అందక గత పది రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గార్ల పట్టణ మహిళలు, ప్రజలు బుధవారం రోడ్డెక్కారు. సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో భారీ ప్రదర్శన నిర్వహించి, పంచాయతీ వద్ద జరుగుతున్న రెవెన్యూ గ్రామసభను ముట్టడించారు.?నెహ్రూ సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు మహిళలు ఖాళీ బిందెలతో ప్రదర్శనగా తరలివచ్చారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు, గ్రామీణులతో కలిసి బైఠాయించి తీవ్ర నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కందునూరి శ్రీనివాస్, అలవాల సత్యవతి మాట్లాడుతూ.. గత పది రోజులుగా గార్ల పట్టణంలో తాగునీరు రాక ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు పడుతున్న నీటి తిప్పలు కంటికి కనిపిస్తున్నా పంచాయతీ పాలకవర్గం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించే వరకు నిరీక్షించకుండా, వెంటనే ట్యాంకర్లు లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించాలని కోరారు.మహిళల ఆందోళనపై స్థానిక సర్పంచ్ బానోత్ పార్వతి హతిరామ్ నాయక్ సానుకూలంగా స్పందించారు. మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ల వద్ద మరమ్మతుల కారణంగానే సరఫరాలో అంతరాయం ఏర్పడిందని సభకు వివరించారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రతి వార్డుకూ నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన ఆందోళనకారులు తమ నిరసనను విరమించారు.ప్రజల నీటి పోరాటానికి పలు రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలిచాయి. న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి. సక్రు, ఐద్వా మండల కార్యదర్శి ఎం. నాగమణి, వార్డు సభ్యులు పూర్ణచందర్, టీజేఎస్ రాష్ట్ర నాయకులు జి. మురళీ తారక్, సీపీఎం, ఎన్జీ నాయకులు టి. నాగేశ్వరరావు, మాన్య తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు కల్పన, దుర్గ, స్వరూప, సుగుణ, మంగమ్మ, రమాదేవి, వెంకటలక్ష్మి, నవ్య, బేగం, సునీత, సుజాత, అనితలతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా 'మిరప పొలంబడి' ప్రారంభం

గార్ల,సెప్టెంబర్ 2 (ప్రభాత గమనం):
వ్యవసాయంలో ఆధునిక సాగు పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా గార్ల మండలం మద్దివంచ గ్రామంలో 'మిరప రైతు పొలంబడి' కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సౌజన్యంతో ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు.?ఈ సందర్భంగా కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీ ఉదయశంకర్ మాట్లాడుతూ.. మిరప పంటలో దిగుబడులు పెంచడంతో పాటు తెగుళ్ల నివారణకు పొలంబడి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రాబోయే 14 వారాల పాటు ప్రతి వారం రైతులకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష శిక్షణ ఇస్తామని వివరించారు.?మరో అధికారి (ప్లాంట్ ప్రొటెక్షన్) బసవన్నప్ప మాట్లాడుతూ.. రైతులందరూ ఒకే స్ఫూర్తితో ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గార్ల మండల వ్యవసాయ అధికారి శ్రీ రామారావు మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా ప్రతి వారం పొలంబడికి హాజరుకావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న ఈ పద్ధతుల వల్ల సాగు వ్యయం తగ్గి లాభాలు పెరుగుతాయని బయ్యారం వ్యవసాయ అధికారి శ్రీ రాజు తెలిపారు.?ఈ కార్యక్రమంలో స్థానిక ఉద్యానవన శాఖ అధికారిణి శ్రీమతి శాంతిప్రియ, వ్యవసాయ విస్తరణ అధికారిణి శ్రీమతి మేఘన, గ్రామ ఉప సర్పంచ్ భుక్య కైలా, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు. తమ పొలాల్లోనే శాస్త్రీయ పద్ధతులు నేర్పించేలా పొలంబడిని ప్రారంభించడం పట్ల మద్దివంచ రైతులు హర్షం వ్యక్తం చేశారు.



